క్లుప్తంగా

పెద్దవాగు వంతెన పరిశీలించిన ఈఈ


కోతకు గురైన వాగును పరిశీలిస్తున్న ఈఈ

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం–యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య పెద్ద వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను పంచాయతీరాజ్ జగిత్యాల ఈఈ అబ్దుల్ రహమాన్ శనివారం పరిశీలించారు. కోతకు గురవుతున్న వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. కోతకు గురైన ప్రాంతం మరమ్మతులకు అదనపు నిధులు అవసరమని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. ఈఈ వెంట ఏఈ ఆదిత్య, ఉపసర్పంచ్ సాగరిక, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి


అక్షరభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ మహేశ్వరీ

పెగడపల్లి: అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరీ అన్నారు. మండలంలోని పెగడపల్లి, సుద్దపల్లి, దోమలకుంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సామూహిక అక్షర భ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ఆంగ్లంలో బోధిస్తున్నామని, చిన్నారులను కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలు, సలహాలపై సూచనలు చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు నిహారిక, హారిక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బీఎస్పీ మద్దతు


మద్దతు తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

కోరుట్ల: తమ డిమాండ్ల సాధనకు సమ్మె బాట పట్టిన పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులకు బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. శనివారం సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ బీఎస్పీ అధ్యక్షుడు ముహమ్మద్ ముజాహిద్, నాయకులు శనిగారపు ప్రశాంత్, అక్షయ్, కృష్ణప్రసాద్, భువనేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కథలాపూర్ : తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె జిల్లావ్యాప్తంగా శనివారం కూడా కొనసాగింది.

రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న పశువైద్యాధికారి శ్రీనివాస్

కథలాపూర్: రైతులు పంటలసాగుతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని పశువైద్యాధికారి అంకం శ్రీనివాస్ అన్నారు. శనివారం కథలాపూర్ మండలం అంబారిపేటలో రైతులకు పశుగ్రాసం పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం గడ్డి విత్తనాలు ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. ఖాళీ స్థలాల్లో పశువుల మేతకు ఉపయోగపడే గడ్డిని పెంచితే రైతులకు లాభం వస్తుందన్నారు. సమావేశంలో సర్పంచ్ గోపు శ్రీనివాస్, ఎంపీటీసీ వేముల గంగరాజం, రైతులు పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన జెడ్పీటీసీ

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో నర్సరీని శనివారం జెడ్పీటీసీ జాదవ్ అశ్విని పరిశీలించారు. హరితహారంతో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఆమె వెంట కార్యదర్శి అక్బర్ ఉన్నారు.

యాక్టింగ్‌లో అదుర్స్

- సినిమా, సీరియల్స్‌లో రాణిస్తున్న కోరుట్లకు చెందిన రమణ
- బైరాన్‌పల్లి సినిమాలో పోలీస్ పాత్రతో గుర్తింపు
- హల్వా వ్యాపారం నుంచి నటనవైపు అడుగులు

కోరుట్లటౌన్: కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన బండపాకురు రమణ(50) సినిమా రంగంలో రాణిస్తున్నాడు. 10 సినిమాలు, 2 సీరియల్స్‌లలో నటించి, వివిధ పాత్రలు వేసి ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందాడు.


సినీ నటుడు, హీరో మోహన్‌బాబుతో రమణ

బాల్యం



- రాయికల్ మండల కేంద్రంలో పదోతరగతి విద్యపూర్తి చేశాడు. కటిక పేదరికంతో గుడిసెలో కాలం గడిపాడు. కోరుట్లలో ఇంటర్ విద్య పూర్తి చేశాడు. డిగ్రీ చదువులు ఆగిపోయాయి. వివిధ పనులు చేస్తూ జీవనం సాగించాడు. తల్లి నర్సమ్మ తన తండ్రి వద్ద నేర్చుకున్న ఆయుర్వేద గృహ వైద్య, బదాం హల్వా తయారీ కొడుకు రమణకు నేర్పింది. ఈ క్రమంలో రమణ..బాదాం హల్వా రమణగా మారిపోయాడు. ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు. చాలా మందికి సేవలు అందించి, పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు.

హీరో కృష్ణ ఇంటి నుంచి రమణకు పిలుపు



- కోరుట్ల బాదాం హల్వా రమణకు సినీ నటుడు హీరో కృష్ణ ఇంటి నుంచి ప్రసాద్ వర్మ ఫోన్ చేశాడు. మహేష్‌బాబు పిల్లలకు బాదాం హల్వా కావాలని రమణకు పిలుపు అందింది. ఈ క్రమంలో ప్రసాద్ వర్మతో ఉన్న పరిచయం సినీ రంగం వైపు రమణ అడుగులు వేసేందుకు దారి చూపింది. 10 సినిమాలు, 2 సీరియల్స్‌లో వివిధ పాత్రలు రమణ చేశాడు. బైరాన్‌పల్లి సినిమాలో పోలీస్ పాత్ర రమణకు గుర్తింపు ఇచ్చింది. కోరుట్ల సినిమా థియేటర్‌లో రమణ పోలీస్ పాత్ర ఉన్న బ్యానర్ కట్టి అభిమానం చాటుకున్నారు. ప్రముఖ సినీ నటులతో కోరుట్ల బాదాం హల్వా రమణకు పరిచయాలు పెరిగాయి. వృత్తిగా ఆయుర్వేద వైద్యం, బాదాం హల్వా వ్యాపారం చేస్తూ నటనలో మంచి పాత్రలు అవకాశం ఉన్నప్పుడు నటనతో ముందుకు సాగనున్నారు.

మంచి నటుడిగా గుర్తింపే లక్ష్యం



పేదలకు ఉచిత వైద్యం అందిస్తాను. మంచి నటుడుగా గుర్తింపు తెచ్చుకునేందుకు కృషి చేస్తాను.

బాదాం హల్వా రమణ, కోరుట్ల

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల నిరసన


మల్యాలలో భిక్షాటన చేస్తున్న కార్మికులు


గొల్లపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న జీపీ కార్మికులు

సారంగాపూర్/ మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/ గొల్లపల్లి/బుగ్గారం/ మల్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 10 వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలు మండల కేంద్రాల్లో కార్మికులు వినూత్నంగా నిరసనలు చేపట్టి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పంచాయతీ కార్మికులు వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలో ఒంటికాలుపై నిల్చొని, మల్యాలలో భిక్షాటన చేస్తూ, గొల్లపల్లిలో చెవిలో పువ్వు.. చేతిలో చిప్పతో వినూత్నంగా నిరసనలు వ్యక్తం చేశారు. అనంతరం కార్మికులు మండల ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు అందించారు. కార్మికులకు వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. బుగ్గారంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్మికులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు వినతి


వినతిపత్రం ఇస్తున్న దళిత మోర్చా నాయకులు

జగిత్యాలటౌన్: బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో దళితుల సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ దళిత మోర్చా నాయకులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా దళితులకు చేసిందేమీలేదన్నారు. దళిత ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని గుర్తు చేశారన్నారు. దళితుల కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఖర్చు చేయకుండా ఇతర పథకాలకు మళ్లించిన కేసీఆర్ దళితులను మోసం చేశారని ఆరోపించారు. దళితబంధు పథకం ప్రకటించిన సీఎం కేసీఆర్ ఆ పథకాన్ని తమ పార్టీ కార్యకర్తలకే పరిమితం చేశారని విమర్శించారు. రాష్ట్రంలోని దళితులందరికీ దళితబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలతో దళితులను దగా చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితుల సంక్షేమానికి చేసింది శూన్యమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి నాట్లపై రైతులకు అవగాహన

కథలాపూర్: మండలంలోని కలిగోటలో రైతులకు వరి నాట్లు వేయడంపై శనివారం వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. నాట్లు వేసే సమయంలో వరినారుపై కొనను తుంచేయాలన్నారు. ఇలా చేస్తే మొగి పురుగు, ఆకు ముడుత పురుగుల నుంచి రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యోగిత, ఏఈవో శేఖర్, రైతులు పాల్గొన్నారు.

మహిళ సంఘాలకు వడ్డీ మాఫీ పత్రాలు పంపిణీ

కథలాపూర్: బీమారం మండలం వెంకట్రావుపేటలో మహిళా సంఘాలకు వడ్డీ మాఫీ మంజూరు పత్రాలను శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. గ్రామంలోని 29 మహిళ సంఘాలకుగాను రూ.7,19,072 వడ్డీ మాఫీ అయినట్లు అధికారులు తెలిపారు. వడ్డీ మాఫీ డబ్బులు సంఘాల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాటిపెల్లి జగన్‌రెడ్డి, ఎంపీటీసీ సుదవేని లక్ష్మి, మాజీ సర్పంచ్ భూమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన జనసేన సైనికుడు ఎర్దండి వెంకటి మృతి చెందగా, బాధిత కుటుంబానికి శనివారం జనసేన పార్టీ ఇన్‌చార్జి బెక్కం జనార్దన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీపరంగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో స్వాతిరెడ్డి, మాదవ రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు బత్తిని బాబు, పొన్నం రాకేశ్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకుంటే ఆందోళనలు

మెట్‌పల్లి: ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించని నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. పాత పెన్షన్ అమలు కోసం దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని, వీటిని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.

డ్రమ్ సీడర్ ఉపయోగంపై అవగాహన

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లిలో డ్రమ్‌సీడర్ ఉపయోగంపై వ్యవసాయ అధికారులు శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రమ్ సీడర్‌తో నేరుగా వరి విత్తనాన్ని వేయటం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, కూలీల ఖర్చు ఆదా అవటంతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

రాయికల్‌లో గోరింటాకు వేడుకలు


గోరింటాకుతో మహిళలు

రాయికల్: పట్టణంలో కౌన్సిలర్ శ్రీరాముల సువర్ణ ఆధ్వర్యంలో శనివారం ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. అనంతరం గోరింటాకు విశిష్టతపై వివరించారు. కార్యక్రమంలో లక్ష్మి, సుమలత, రజిత, మధులత, మేఘన, సంజన పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన ఎంపీవో

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన టీఎస్.దివాకర్‌ను జగిత్యాల ఎంపీవో రవిబాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉత్తమ విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుంది

సారంగాపూర్: ఉత్తమ విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని కోనాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మచ్చ శంకర్ అన్నారు. శనివారం ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలల్లో అనుభజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారానే విద్యార్థులకు బోధన అందుతుందని, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఇతర మౌలిక వసతులు అందడం ప్రైవేట్ పాఠశాలల్లో ఉండదన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కథల పోటీలకు స్పందన

కోరుట్ల: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కథ చెబుతారా ఊ కొడుతారా కథల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 300 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. 1 నుంచి 5 వతరగతి వరకు జూనియర్స్, 6 నుంచి 10 వ తరగతి వరకు సీనియర్స్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు ప్రోత్సాహకంతో పాటు టీటీడీ వారి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రాంరెడ్డి క్రిష్ణమూర్తి, మంచాల జగన్, హెచ్‌ఎం భూపతి, తెలుగు పండితుడు మనోహరాచారి పాల్గొన్నారు.

హైవే పక్కనే ప్రమాదకర డ్రెయినేజీ



కోరుట్ల: పట్టణంలోని నంది చౌరస్తా సిగ్నల్ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న మురికి కాలువ ప్రమాదకరంగా ఉంది. దుకాణాల ముందు ఉన్న ఈ మురికి కాలువతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అదికారులు, ప్రజాప్రతినిధులు ఈ మురికి కాలువకు మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ధర్మపురిలో బోనాలతో విద్యార్థినులు

ఘనంగా బోనాలు


రాయికల్‌లో బోనాలతో విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని ప్రగతి హైస్కూల్, ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ రాష్ట్ర బోనాల పండగను ముందస్తుగా ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నెత్తిన పెట్టుకోగా పోతరాజుల విన్యాసాలు, కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఆషాడమాసాన్ని పురస్కరించుకుని విద్యార్థులు గోరింటాకు వేడుకలు నిర్వహించుకున్నారు.

కేజీబీవీలో ముందస్తుగా బోనాలు

కథలాపూర్: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ముందస్తుగా బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో పూజలు చేశారు. విద్యార్థినులకు మన సాంప్రదాయాలు, సంస్కృతీ తెలవడానికి బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు టీచర్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ప్రత్యేకాధికారి అనిత, టీచర్లు పాల్గొన్నారు.

ధర్మపురి: ఆషాఢమాసం సందర్భంగా ధర్మపురి ఏసీఈ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పోచమ్మ బోనాలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు నూతన పట్టు వస్త్రాలు ధరించి ఆలయం వరకు బోనాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

మెట్‌పల్లి పట్టణంలో..

మెట్‌పల్లి: పట్టణంలో పలు పాఠశాలల్లో శనివారం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతురాజు, అమ్మవార్ల వేషధారణలతో ఆకట్టుకున్నారు. బోనాలతో ఊరేగించి పూజలు నిర్వహించారు.

షుగర్ ఫ్యాక్టరీ కోసం బీఆర్‌ఎస్ ఆందోళనలు చేయాలి


మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

మెట్‌పల్లి: ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ కోసం బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనలు చేయాలని ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉచిత విద్యుత్ విషయంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి బీఆర్‌ఎస్ ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడుతుందని ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్..ఆ తర్వాత దానిని నిలబెట్టుకోకపోగా నడిచే దానిని మూసివేసిందన్నారు. రైతు సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు ఫ్యాక్టరీని తెరిపించడం కోసం ఆందోళనలు చేయాలన్నారు. సమావేశంలో మహిపాల్ రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, గోరుమంతుల ప్రవీణ్ తదితరులున్నారు.

ఘనంగా మంత్రి కొప్పుల పెళ్లిరోజు వేడుకలు

ధర్మపురి: రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్నేహలత పెళ్లిరోజు వేడుకలను శనివారం ధర్మపురి పుణ్యక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో దేవస్థానం పక్షాన దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ దంపతులకు స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలను అందించి స్వామి వారి ఫొటోను బహూకరించారు. అనంతరం స్థానిక నంది కూడలి వద్ద దంపతులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డీసీ ఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఉపాధ్యక్షుడు రామన్న, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ రాజేశ్, కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

పెగడపల్లి: రానున్న ఎన్నికల్లో మరోసారి మంత్రి ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని మండల బీఆర్‌ఎస్ కన్వీనర్ ఐరుగురాల ఆనందం అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల అడ్వైజరీ కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మంత్రి ఈశ్వర్ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ, ఇంకా ఉన్న ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్మదర్శి మల్లారెడ్డి , వెంకన్న, అడ్వైజరీ కమిటీ సభ్యులు కరుణాకర్‌రావు, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రావు, సురేందర్‌రావు, ఆనందం, కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్: అపరిచిత వ్యక్తులతో బాలికలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు. శనివారం మేడిపెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ×మానవ అక్రమ రవాణా« పై అవగాహన సదస్సు నిర్వహించారు. కొత్త వ్యక్తులు ఇచ్చే ఆహార పదార్థాలు తినవద్దన్నారు. ఎవరైనా వేధింపులకు పాల్పడిన 100 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, ప్రత్యేకాధికారి నిశాత్ సాహేదా, సీఆర్‌పీ చంద్రశేఖర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

రాయికల్: పట్టణంలోని శాలివాహన సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి గంగారాం, ప్రధాన కార్యదర్శి గంగధరి సురేశ్, నాయకులుపాల్గొన్నారు.

లేబర్ కార్డులు పంపిణీ

వెల్గటూర్: ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన లింగంపల్లి చందు తాత లింగంపల్లి రాజయ్య జ్ఞాపకార్థం జనంకోసం అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి ఆ సంస్థ ద్వారా గుల్లకోట గ్రామానికి చెందిన 43 మందికి ఉచితంగా లేబర్ కార్డులు పంపిణీ చేశారు. మంత్రి కొప్పుల చొరవతో చొప్పరి సుజాతకు మెటర్నిటీ బెనిఫిట్ కింద మంజూరైన రూ.30 వేలు సోమవారం లింగంపల్లి చందు అందజేశారు.

దేవాలయ ప్రాంగణంలో హోటల్

జగిత్యాలరూరల్: అది ఆలయ భూమి. దేవాలయ ఆధీనంలో ఉండగా, అక్కడ అపరిశుభ్రత చోటుచేసుకుంటుందని ఓ వ్యక్తి తాత్కాలికంగా హోటల్ ఏర్పాటు చేసుకున్నాడు. ప్రస్తుతం భక్తులకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి దేవాదాయ శాఖ అధికారులు సిద్ధం చేయగా హోటల్ ఖాళీ చేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఆలయం విశాలంగా చేసేందుకు శిథిలావస్థలో ఉన్న రెండు రూములను దేవాదాయ శాఖ అధికారులు తొలగించారు. లయ స్థలంలో ఉన్న హోటల్ యజమాని నెలనెలకు రూ.500 చెల్లిస్తున్నాడు. కానీ హోటల్‌కు వచ్చే భక్తులు చెప్పులతో పాటు, చెత్తాచెదారం వేస్తుండటంతో భక్తులకు ఇబ్బందికరంగా ఉండటంతో ఆలయంలో ఉన్న హోటల్‌ను తొలగించి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

కుప్పలు కుప్పలుగా కూల్ డ్రింక్స్

వెల్గటూర్: మండల కేంద్రంలోని శ్మశానవాటిక సమీపంలో గడువుదీరిన అయిన కూల్ డ్రింక్స్ గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లినట్లు సమాచారం. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన కొందరు గ్రామస్తులు చూసి సమాచారమివ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నిర్లక్ష్యంగా శీతల పానియాలు బహిరంగంగా పడేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ

కోరుట్ల: పట్టణ శివారులోని కల్లూర్ రోడ్డులోని గురుకుల పాఠశాల సమీపంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యకులు పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేశారు. ఈ మేరకు ట్రాన్స్‌కో అధికారులు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.